క్లుప్తంగా

అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలు దారుణం


జొన్నకూటి పోశిరాజు, ఎంపీపీ, తాళ్లపూడి

తాళ్లపూడి: అసెంబ్లీలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజానికి సిగ్గుచేటని, మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడంతోనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు దుయ్యబట్టారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ కుటుంబ సభ్యులపై అందరికీ గౌరవం ఉండేదని, బాలకృష్ణ వ్యాఖ్యలతో ఆ గౌరవం పోయిందన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలు ఆయన దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. అసలు సంబంధం లేని సినీ నటుడు చిరంజీవిపై కూడా తూలనాడడం సరికాదన్నారు. దానిని కనీసం ఖండించలేని స్థితిలో జనసేన మంత్రులు, ఎమ్మెల్యేలు ఉన్నారని అన్నారు. బాలకృష్ణ తక్షణమే జగన్‌మోహన్‌రెడ్డికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే తలారి పరామర్శ


జోషిని పరామర్శిస్తున్న వెంకట్రావు

చాగల్లు: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది, ప్రస్తుతం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కలవలపల్లి శివారు రామచంద్రాపురానికి చెందిన యర్లగడ్డ జోషిని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరామర్శించారు. త్వరలో కోలుకుని, క్రియాశీల కార్యక్రమాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఎంపీపీ మట్టా వీరస్వామి, జిల్లా జనరల్ సెక్రటరీ జుట్టు ఏడుకొండలు, ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు ఇంటి వీర్రాజు, చాగల్లు మండల అధ్యక్షుడు మట్టా వెంకటరావు, చెల్లింకల దుర్గా మల్లేశ్వరరావు ఉన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యంతో రుగ్మతలు

పెరవలి: వ్యక్తిగత ఆరోగ్యంపై గ్రామీణ మహిళలు నిర్లక్ష్యం వహించటం వల్ల అనేక రుగ్మతలకు గురవుతున్నారని కానూరు పీహెచ్‌సీ వైద్యురాలు తేజశ్రీ అన్నారు. మండలంలోని తీపర్రులో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మహిళలకు అన్ని పరీక్షలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు హేమరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వేస్ట్ టు ఎనర్జీ కేంద్ర పరిశీలన

నిడదవోలు: పట్టణంలోని డంపింగ్ యార్డులో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా కృషి చేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. ఇందులో భాగంగా పుణే నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సీఎంఈఎస్ సంస్థ ఏర్పాటు చేసిన వేస్ట్ టు ఎనర్జీ కేంద్రాన్ని మున్సిపల్ ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఎస్.హేమంత్‌కమల్‌తో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఆ ప్లాంట్‌ను నిడదవోలు పట్టణంలో ఏర్పాటు చేయడానికి కావాల్సిన ప్రతిపాదనలు, ప్రాజెక్టు నివేదికను కేంద్ర ప్రతినిధులు వీరికి వివరించారు. చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ పుణే ఉన్న వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌లో ప్రతిరోజు సుమారు 200 మెట్రిక్ టన్నుల తడి చెత్తను రివర్స్ బొటానికల్ ప్రాసెస్ ద్వారా గ్రీన్ పవర్ కలిగిన ఇంధనం హైడ్రోజన్, గ్యాస్ ఉత్పత్తి అవుతుందన్నారు. ఈ ప్లాంట్‌ను నిడదవోలు పట్టణంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

బాలదుర్గమ్మ ఆలయానికి విరాళాలు


విరాళం అందజేస్తున్న దాత వెంకటసురేష్ దంపతులు

దేవరపల్లి: సంతాన లక్ష్మిగా కొలవబడుతున్న బాలదుర్గమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి శుక్రవారం గ్రామానికి చెందిన పడాల వెంకట సురేష్, సంధుజ దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. దాతలకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

తెగుళ్ల మేరకు మందులు వాడాలి

పెరవలి: వాతావరణంలో వచ్చిన మార్పులతో వరి చేలపై తెగుళ్ల ఉధృతి ఉంటుందని, పంట చేలలో ఆశించిన పురుగులు, తెగుళ్ల మేరకు మందులు వినియోగించాలని ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కానూరులో సమగ్ర సస్య సంరక్షణ కేంద్రం (విజయవాడ) ఆధ్వర్యంలో వరి, కోకో, అరటి, కొబ్బరి పంటల సస్యరక్షణ పద్ధతులపై చేపట్టిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆయన మాట్లాడుతూ, వరిలో మిత్ర పురుగులను రక్షించుకుంటూ, శత్రు పురుగులను నిర్మూలించాలని చెప్పారు. నేరుగా వరి చేలలో నెట్ సాయంతో మిత్ర పురుగులను, శత్రు పురుగులను ప్రయోగాత్మకంగా పట్టుకుని చూపించారు. ఒకవేళ పంటకు మందులు పిచికారీ చేయాల్సి వస్తే వేప సంబంధిత వాటినే వాడాలన్నారు. వరి చేలలో ఆకు ఎండు తెగులు, ఎర్రనల్లి, తెల్లదోమ ఉన్నాయని చెప్పారు. ఏవో మేరీకిరణ్, శాస్త్రవేత్త నర్సింహారావు, పలువురు సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ఆశనిరాశల నడుమ..!

- ఖరీఫ్ వరి కోతలు ప్రారంభం
- మండలంలో 9,200 ఎకరాలలో వరి సాగు
- జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరికలు


అనంతపల్లిలో ధాన్యాన్ని ట్రాక్టర్‌లోకి వేస్తున్న మెషీన్

నల్లజర్ల: వ్యవసాయ రంగం ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతితో పెద్ద పోరాటమే చేస్తోంది. తొలకరి పలకరింపుతో చిగురించిన ఆశలు, ఆపై వర్షాభావంతో నెలకొన్న ఆందోళనలు, తిరిగి భారీ వర్షాలతో వచ్చిన ఊరట, ఇప్పుడు ఎరువుల కొరత రూపంలో ఎదురవుతున్న కొత్త సవాళ్లు ఇలా రాష్ట్రంలోని అన్నదాతల పరిస్థితి నిత్యం ఉత్కంఠ భరితంగా సాగుతోంది. డెల్టా రైతులు కాలువల నీటితో భరోసాగా ఉంటే, మెట్టప్రాంత రైతులు పూర్తిగా వరుణుడి కరుణను నమ్ముకున్నారు. ఈ సంక్లిష్ట పరిస్థితులలో ప్రభుత్వం కూడా రైతులకు కడా తగిన చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉంది. దీంతో అనంతపల్లిలో ముందుగానే చేతికొచ్చిన పంటను వర్షాల బారిన పడకుండా పచ్చిపైనే రైతులు మిషన్లతో కోతలు ప్రారంభించారు. మండలంలోని ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 9,200 ఎకరాలలో వరిపంట సాగైంది. ఇందులో సంపత్ స్వర్ణ-4,500 ఎకరాలు, పీఎల్-1100, రకం 2,500 ఎకరాలలోను, మరో 2వేల ఎకరాలలో పీఆర్-126 రకం సాగైంది. ఈ రకం తెగులును, వర్షాలను తట్టుకునే విధంగా ఉండటంతో ఈ ఏడాది గతేడాది కంటే ఎక్కువగానే సాగు చేశారు.

హెచ్చరికలు చేస్తున్నా..

చెదురుమదురు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్నా పలు గ్రామాల్లో (పీఆర్-126 రకం) రైతులు కోతలను ప్రారంభించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను అధికమించి కోతలకు దిగితే వర్షానికి ధాన్యం తడిస్తే మొదటికే మోసం వస్తుందని, అలాగని ఉంచితే నీటిలో మునిగిపోయే ప్రమాదం లేక పోలేదని అధికారులు సూచనలు చేస్తున్నారు. దీంతో కోతలపై రైతులు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు.


పక్వానికి వచ్చిన వరిచేను

దళారీల దందా

ఎకరానికి 40 నుంచి 45 బస్తాల (75కిలోలు)దిగుబడి వచ్చినట్టు రైతులు చెబుతున్నారు. ఒక్కో బస్తా రూ.1,360లకు కమీషన్ వ్యాపారులు పక్క మండలాల్లో కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడకు వచ్చేసరికి రూ.1,200 లకే అడుగుతున్నారని, రెండు రోజుల వ్యవధిలోనే రూ.160 ధర పడిపోయింది. అక్టోబరు నెలలో ప్రారంభం కావాల్సిన వరి కోతలు 20రోజులు ముందుగానే ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలు అక్టోబరు 10వ తేదీ తర్వాతే ప్రారంభంకావచ్చునని చెబుతున్నారు. అంతవరకు రైతులు కోతలు కోకపోతే ధాన్యం చేతికందే పరిస్థితి ఉండదు. కష్టమో..నష్టమో పంటను అయిన కాడికి అమ్ముకుని రైతులు చేతులు దులుపుకుంటున్నారు.

వాతావరణం అనుకూలిస్తే గట్టెక్కినట్టే..



పీఆర్-126 రకం మొత్తం పక్వానికి వచ్చింది. ఈ సమయంలో వర్షాలు పడితే పంట బరువెక్కి నేలకొరిగే అవకాశం ఉంది. అటువంటప్పుడు పంటను మిషన్లతో కోసే అవకాశం ఉండదు. కూలీలతో కోయించే పరిస్థితి వస్తుంది. అది రైతుకు మరింత భారంగా మారుతుంది.

– వల్లూరి వెంకటేశ్వరావు, రైతు, నల్లజర్ల

జాగ్రత్తలు పాటించాలి



ఈ నెల 27న మరో అల్పపీడనం ఉంది. అధిక వర్షాలకు రైతులు అప్రమత్తంగా ఉండాలి. నూర్చిన ధాన్యాన్ని తడవకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. అధిక వర్షాలు సూచిస్తే కోతలు పూర్తి స్థాయిలో నిలిపివేయాలి. పంటపొలంలో నీరు నిల్వ ఉండకుండా బయటకు పోయే విధంగా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి.

– బి.సోమశేఖరం, వ్యవసాయాధికారి, నల్లజర్ల మండలం

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు తాడిమళ్ల విద్యార్థుల ఎంపిక


క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నిడదవోలు రూరల్: గుంటూరు నాగార్జున యూనివర్సిటీ గ్రౌండ్‌లో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు నిడదవోలు మండలం తాడిమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీహెచ్ పద్మ శుక్రవారం తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో ఇటీవల జరిగిన జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ ఎంపికల్లో బి.ప్రేమ్‌కుమార్, పి.శివ దుర్గలక్ష్మి (ట్రయాథ్లాన్), ఎం.వెంకటేష్ (జావెలిన్ త్రో) (షాట్‌పుట్), పి.వెంకట మురళీ(60, 600 మీటర్ల పరుగు)లో ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ బి.ప్రదీప్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఎంపీడీఓకు రిటైర్డు ఉద్యోగుల అభినందనలు

నల్లజర్ల: ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన ఎం.వి.ఎస్ సత్యనారాయణను శుక్రవారం రిటైర్డు ఉద్యోగులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఐవీ సత్యం, ఉన్నమట్ల వెంకటేశ్వరావు, ఐడీవీ అప్పారావు, నెక్కలపూడి ప్రతాప్, ప్రభుదాస్, గుత్తికొండ ప్రసాద్, ఈడ్పుగంటి ప్రసాద్, బాలయ్య పాల్గొన్నారు.

కోట సత్తెమ్మను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే


కోటసత్తెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీనివాస్‌నాయుడు, పార్టీ శ్రేణులు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెం గ్రామంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారిని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ వెలగన పోలయ్య, పార్టీ నాయకులు యాళ్ల రామారావు, అయినీడి వెంకటకృష్ణ, ఆలమూరి రాజా, విస్సా గణేష్ తదితరులు పాల్గొన్నారు. గోపవరం గుబ్బల మంగమ్మ, సమిశ్రగూడెంలో పుంతలోము సలమ్మ ఆలయాల వద్ద భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, కుంకుమ పూజలు చేశారు. లోహియానగర్‌లో కనకదుర్గమ్మ, కోరుమామిడిలోని అమ్మేపల్లిలో వీరాంజనేయసహిత రాజరాజేశ్వరి స్వామి, కంసాలిపాలెం శ్రీదేవీ పాటెమ్మ ఆలయాల వద్ద భవానీలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

దానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

నిడదవోలు: పట్టణంలోని 20వ వార్డులో వేంచేసిన దానమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు శుక్రవారం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పడాల శిరిష, మొదలవలస నాని, కలగా రమణ తదితరులు పాల్గొన్నారు.

బార్ తొలగించాలంటూ ఆందోళన

నిడదవోలు: పట్టణంలోని సుబ్బరాజుపేట దళితవాడలో ఏర్పాటు చేసిన బార్ అండ్ రెస్టారెంట్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ కార్యాలయం వద్ద వివిధ పార్టీల నాయకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. సుబ్బరాజుపేటలో నిబంధనలకు విరుద్ధంగా కొందరు దౌర్జన్యంగా ప్రైవేట్ స్థలంతో పాటు, కొంతభాగం మున్సిపల్ స్థలాన్ని కబ్జా చేసి, కంటైనర్, టెంట్లు ఏర్పాటు చేసి మద్యం పారిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నిత్యం మందుబాబుల ఆగడాలతో ప్రశాంతంగా ఉండే సుబ్బరాజుపేట, జ్యోతికాలనీ, సింగవరం, తీరుగూడెం గ్రామాల ప్రజల్లో భయాందోళన నెలకొందన్నారు. బార్ తొలగించాలని నాలుగు రోజులుగా ఆందోళన జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తూ ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహిళా హక్కుల కార్యకర్త దిద్దే దయామణి మాట్లాడుతూ, నడిరోడ్డుపై బార్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకుడు బైపే రాజేశ్వరరావు మాట్లాడుతూ, మద్యం వ్యాపారులు బార్లు ఏర్పాటు చేయడానికి దళితపేటలే అనుకూలమా అని నిలదీశారు. బార్‌ను తొలగిస్తామని హెచ్చరించారు. న్యూ స్పిరిట్ చర్చి పాస్టర్ దిరిశాల కరంచంద్ మాట్లాడుతూ, చర్చిల ముందు బార్ రెస్టారెంట్ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధమన్నారు.


ఎక్సైజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

అనంతరం ఎక్సైజ్ హెచ్‌సీ రవికుమార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, టీడీపీ నాయకులు కొడమంచిలి జార్జి సారథి, బీఎస్పీ నాయకులు అంబటి పుల్లారావు, గెద్దం కుమార్, షాహీ తదితరులు పాల్గొన్నారు.

అభినందన సత్కారం


ముప్పిడి మహాలక్ష్మిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

చాగల్లు: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన ఎస్.ముప్పవరం సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్మిని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సన్మానించారు. మండలంలోని చాగల్లులో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ గంథ్రోతు సురేంద్ర, జిల్లా జనరల్ సెక్రటరీ జుట్టు ఏడుకొండలు, గెడ శ్యామ్, ఆర్టీఐ జిల్లా అధ్యక్షులు ఇంటి వీర్రాజు, తోట రామకృష్ణ, ఉప్పులూరి సూరిబాబు, చౌటపల్లి వీరన్న, జిల్లా మహిళా సెక్రటరీ తాళ్లూరు నాగమణి, జిల్లా ఎస్సీ సెక్రటరీ కందుకూరి శ్యామ్, చాగల్లు టౌన్ ప్రెసిడెంట్ బొర్రా రజిని, బొర్రా కృష్ణ, చిక్కాల ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, నాగరాజు, తాతా రాఘవ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు నష్ట పరిహారం ఇవ్వండి


పాడి రైతులకు నష్ట పరిహారం కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉప సర్పంచ్ రామకృష్ణ

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామంలో గేదెలు అంతు చిక్కని వ్యాధితో చనిపోతున్న సందర్భంగా నష్టపోయిన పాడి రైతులను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం ఉప సర్పంచ్ తోట రామకృష్ణ జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరికి వినతి పత్రం అందజేసినట్టు తెలిపారు. అధికారులు గేదెలకు వైద్య సేవలు అందజేస్తున్నప్పటికీ వాటి మరణాల సంఖ్య ఆగలేదని, నష్టపోయిన పాడి రైతుల కుటుంబాలకు త్వరితగతిన ఆర్థిక సహాయం లేదా గేదెలకు సబ్సిడీపై బ్యాంకు రుణాలు అందేలా కృషి చేయాలని ఆయన కోరారు.

పంటను నాశనం చేస్తున్న నత్తలు

నల్లజర్ల: ఆఫ్రికా నత్తల వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామిశెట్టి పరమేశ్వరావు కోరారు. మండలంలో ఆవపాడు, సింగరాజుపాలెంలో పామాయిల్, బొప్పాయి, కోకో, చిక్కుడు, మినుము, పెసర, గడ్డి పంటలపై నత్తలు ఆయా మొక్కల కాండాన్ని, మువ్వను, పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. నత్తల ఏరివేతకు, మందుల పిచికారీకి రైతులు భారీగా డబ్బు ఖర్చుచేస్తున్నా ఫలితం ఉండటం లేదన్నారు. వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం ఈ ప్రాంతంలో పర్యటించి క్రిమిసంహారక మందులు వాడి నిర్మూలించకోవాలని సలహా ఇచ్చారే మినహా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా ఉద్యానశాఖ తక్షణం స్పందించి నత్తల నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సామూహిక నివారణకు కృషి చేయాలి

ఆఫ్రికా నత్తలు సోకిన ఉద్యాన తోటలను వెంకట్రామన్నగూడెం డాక్టరు వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పర్యటించి రైతులు తక్షణం తీసుకోవాల్సిన నివారణ చర్యలు వివరించారు. బృందంలోని శాస్త్రవేత్త డాక్టర్.చలపతిరావు మాట్లాడుతూ కాపర్ సల్ఫేట్ 1.5గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి గాని ఫెర్రస్ సల్ఫేట్ 1.5 మందును లీటరు నీటితో పిచికారీ చేయాలన్నారు. దీంతో 30 శాతం నత్తలు చనిపోతాయని మిగిలిన వాటిని ఉప్పు ద్రావణంలో వేసి నివారించవచ్చన్నారు. సీపీసీ ఆర్.ఐ డైరెక్టర్ చౌడప్ప, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ గోవిందరాజు, జిల్లా ఉద్యాన అధికారి మల్లిఖార్జునరావు, శాస్త్రవేత్త రేఖ, ఉద్యాన అధికారి జి.రమేష్ ఉన్నారు.


ఆవపాడులో పంటలను నాశనం చేస్తున్న ఆఫ్రికా నత్తలు

ఇసుక రవాణాలో నిబంధనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రాణి సుస్మిత

తాళ్లపూడి (కొవ్వూరు): ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల వద్ద రోడ్డుపై లారీలను నిలుపుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం ఇసుక ర్యాంపులు, స్టాక్ పాయింట్ల నిర్వాహకులు, బోట్స్‌మెన్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇసుక రవాణాలో క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి ర్యాంపు వద్ద లారీలకు టోకెన్లు ఇచ్చి క్యూలో గరిష్ఠంగా 5 నుంచి 10 వాహనాలకే అనుమతి ఇవ్వాలన్నారు. మిగతా వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి ఉంచాలని సూచించారు. ప్రతి లారీకి తప్పనిసరిగా టార్పాలిన్ కప్పి ఉండాలని, లేకుంటే లారీ యజమానులు, ర్యాంపు నిర్వాహకులపై పెనాల్టీలు వేస్తామని హెచ్చరించారు. రోడ్లపై పడిన ఇసుకను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం ర్యాంపు నిర్వాహకుల బాధ్యత అని తెలిపారు. బల్క్ బుకింగ్‌కు సంబంధించిన వివరాలను క్రమం తప్పకుండా తమ కార్యాలయానికి పంపాలన్నారు.

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు పూర్తి

ఖరీఫ్‌కు సంబంధించి కొవ్వూరు డివిజన్‌లో 2.43 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ లక్ష్యంగా నిర్ణయించామని ఆర్డీఓ తెలిపారు. రైతు సేవా కేంద్రాలను ఒకేసారి ప్రారంభించి ధాన్యం సేకరణ చేపడతామని, రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం చెల్లింపులు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జిల్లా మైన్స్ అధికారి డి.ఫణిభూషణ్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

నల్లజర్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే దేశం సౌభాగ్యంగా ఉంటుందని పోతవరం పీహెచ్‌సీ డాక్టరు ఎం.డీ.సిరాజుద్దీన్ అన్నారు. శుక్రవారం తెలికిచెర్లలో సర్పంచ్ బండి చిననాగరాజు అధ్యక్షతన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లో మహిళలు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని అటువంటి వారిని గుర్తించి వైద్యపరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణకు మందులు అందిస్తున్నామన్నారు. వైద్య శిబిరాలను మహిళలు తప్పకుండా సద్వినియోగ పర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుంకర రామకృష్ణ, రుద్రా శ్రీనివాస్, గోపిశెట్టి వెంకటేశ్వరావు, ఏఎన్‌ఎంలు ఉషారాణి, ధనలక్ష్మి, ఎంఎల్‌హెచ్ పి.వాసవి తదితరలు పాల్గొన్నారు.

ఆరోగ్యకర సమాజానికి..

నిడదవోలు రూరల్: సమాజం ఆరోగ్యవంతంగా ఉండడానికి మహిళలే ప్రధాన కారణమని, ఆరోగ్యంపై వారు ప్రత్యేక చూపాలని వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ అన్నారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా తాడిమళ్ల పీహెచ్‌సీ పరిధిలోని కంసాలిపాలెం గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 227 మంది రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు.


వైద్య సిబ్బందితో డాక్టర్ సిరాజుద్దీన్, తెలికిచెర్ల సర్పంచ్ చిననాగరాజు

ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు మలిశెట్టి వీరప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

జగన్మాతా ..నమోస్తుతే..


దేవరపల్లిలో కలశాలతో ప్రదర్శన చేస్తున్న మహిళా భక్తులు


తాడిమళ్లలో నగదుతో మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి


తాళ్లపూడిలో శ్రీధనలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు

నిడదవోలు: శరన్నవరాత్ర ఉత్సవాలు పట్టణంలోని ఆలయాల్లో వైభవంగా జరుగుతున్నాయి. నిడదవోలు గ్రామ దేవత నంగాలమ్మ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారు లక్ష్మీదేవి అవతారంలో దర్శనమిచ్చారు. సమిశ్రగూడెం పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ ఒడ్డున ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. అమ్మవారి మహాలక్ష్మీ అలంకరణ ఆకట్టుకుంది. స్థానిక చింతచెట్టు వీధిలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భీమదొరతూము సెంటర్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయం వద్ద దుర్గ భవాని దీక్షా పీఠం ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయం వద్ద 8 అడుగుల దుర్గాదేవి విగ్రహం ఆకట్టుకుంటోంది.

తాళ్లపూడి: దేవీ నవరాత్ర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం ఆలయాల్లో ఉదయం నుంచి అధిక సంఖ్యలో మహిళలు, భవానీ మాలధారులు పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. తాళ్లపూడిలోని నవదుర్గా శ్రీచక్ర సహిత కనక దుర్గమ్మ ఆలయంలో 24వ దసరా మహోత్సవాల సందర్భంగా అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు, సహస్రనామార్చన, లలితా పారాయణం, పల్లకీ సేవ, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మలకపల్లిలోని కనక దుర్గమ్మ ఆలయంలోనూ మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అన్నదేవరపేట, గజ్జరం, పైడిమెట్ట, ప్రక్కిలంక, తాడిపూడి, వేగేశ్వరపురం తదితర గ్రామాల్లో అమ్మవారి మండపాల్లో పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మీ దేవికి జలాభిషేకం

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో దసరా శరన్నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి రోజు అమ్మవారిని వివిధ అవతారాల్లో అలంకరణ చేసి భక్తులు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. 5వ రోజు శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మి దేవిగా అవతారంలో అలంకరణ చేసి భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. దేవరపల్లిలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున్న కలశాలతో గ్రామ పుర వీధుల్లో ప్రదర్శన చేశారు. గ్రామదేవత కడియాలమ్మ అలయం, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, ఇతర ప్రధాన ఆలయాలను సందర్శించి మూడు బొమ్మల సెంటర్లలోని సౌభాగ్య దుర్గాబికా అమ్మవారి ఆలయాని చేరుకుని అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. బాలదుర్గమ్మ అమ్మవారిని రూ.1.90 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మీ దేవిగా అలంకరణ చేసి మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. దీంతో గ్రామాలు ఉత్సవాలతో సందడిగా మారాయి.

తాడిమళ్లలో..

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామంలో దేవీ నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా గౌడవీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మి అలంకరణ చేశారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో రూ.2 లక్షల నగదుతో రూ.500, రూ.100 నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

నల్లజర్ల: శరన్నవరాత్రలను పురస్కరించుకుని మండలంలోని అనంతపల్లి స్వర్ణదుర్గాశ్రమంలో శుక్రవారం శ్రీ చక్ర సమేత స్వర్ణ దుర్గాంబకు మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ దంపతులు పూజాదికాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. నల్లజర్ల వనదుర్గా ఆలయం, దూబచర్ల, తూర్పుచోడవరం, నల్లజర్ల జంక్షన్‌ల్లో నవరాత్ర ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

మహాలక్ష్మీ దేవి అలంకరణలో దర్శనం

గోపాలపురం: శరన్నవరాత్రల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని మహాలక్ష్మీ దేవి అలంకరణ చేపట్టి పూజలు నిర్వహించారు. మండలంలోని చిట్యాల, గోపాలపురం, కరిచర్లగూడెం, దొండపూడి గ్రామాల్లో భవానీ మాలదారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గాదేవి అమ్మవారికి మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

ఘనంగా లలితా సహస్రనామ పారాయణ

నిడదవోలు: పట్టణంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా నిడదవోలు బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం లోక కల్యాణార్థం లక్ష కుంకుమార్చన, సామూహిక లలితా సహస్రనామ పారాయణాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సంఘ అధ్యక్షుడు మునగాల శివ, పత్తనంక సురేంద్రకుమార్, మైలవరపు కామేశ్వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.